కథా నిలయం
3783
శ్రీకాకుళం

# ఎర్ర కలువ

రెడ్డిగారు భోంచేసి తాంబూలం వేసుకొని పొట్ట సవరించుకుంటూ వచ్చారు. ఆ సరికే ఆయన మిత్రులంతా అక్కడికి చేరిపోయి వున్నారు.

"రండి....రండి" అంటూ ఆహ్వానించారు.

"మన మిత్రుడొచ్చాడా?" అంటూ కూర్చున్నారు రెడ్డిగారు.

"ఏదీ ఇంకా రాలేదు" అంటున్నా రెవరో అప్పుడే సుందరం నడుచుకుంటూ వచ్చాడు.

"రావయ్యాబాబూ.... దేశమేమైపోతోంది?"

"తగలబడిపోతుంది" అన్నాడు సుందరం.

"మరి ఫైరింజన్‌కు ఫోన్‌చేసి ఆర్పించు" అన్నారు రెడ్డిగారు.

"నేనాపనెటూ చేస్తాను. నువ్వుమాత్రం ఫిడేల్ వాయించుకో" సుందరం జవాబు.

నవ్వారంతా బిగ్గరగా.

"చూడు సుందరం ఎప్పుడూ పాత జోకులేనా? కేకలేనా! నువ్వు చెప్పే కబుర్లలో ఓ సెంటిమెంటుందా.... ఓ కరుణరసముంటుందా.... ఎప్పుడూ ఆకలి కేకలు, రక్తం మరకలు తప్పితే నీకు మమ్మల్ని కదిలించే సంఘటన చెప్పటం చేతవుతుందా! అసలా విషయం నీకు తెలుసా? మనుషుల్లో ప్రేమఉంది తెలుసా? మీకు మల్లెల వాసన తెలుసా, ప్రియురాలి

విరహవేదన తెలుసా! వెన్నెట్లో తడవటం తెలుసా! ఏం తెలుసు? ఏమీ తెలియదు. అస్థిత్వంలో ఉన్న ప్రతి దాన్నీ విమర్శించటం మాత్రం తెలుసు."

రెడ్డిగారి ఉపన్యాసంతో వాతావరణం వేడెక్కింది. ఆయన ఆగాడు. చీమచిటుక్కు మంటున్న శబ్దంలేదు. అంతా సుందరం వంక చూస్తున్నారు. సుందరం నోటి నుండి ఎలాంటి జవాబు రాగలదో వారికి తెలుసు. రెడ్డిగారు సుందరాన్ని కవ్వించటం, ప్రతిగా సుందరం జవాబులు వారికి మంచి కాల క్షేపం. ఒక్కొకసారి ఆ చర్చల్లోని వాడి, వేడి వారిని కొంతకాలం ఆలోచింప చేస్తాయి. సాధారణంగా సుందరం వెంటనే ప్రతిస్పందిస్తాడు. కానీ ఈరోజు సుందరం వెంటనే ఏ జవాబూ ఇవ్వలేదు.

రెడ్డిగారు దుమ్ము జల్లటంలో బహు నేర్పరి. అయినా క్షణకాలం సుందరం ఆత్మ విమర్శకు లోనయ్యాడు. సమాధానం అంతకంటే తీవ్రంగానూ చెప్పొచ్చు....కానీ....

రెడ్డిగారివంక చూసి చిన్నగా నవ్వాడు సుందరం "చూడండి రెడ్డి గారూ....ఇప్పుడు నేను గుండెలు పిండే కరుణ రసాత్మక కథ మీకు చెబుతాను" అన్నాడు తాపీగా

రెడ్డిగారు బిగ్గరగా నవ్వారు.

"మీరు నడుమ ఎలాంటి ప్రశ్నలు వెయ్యకండి. నేను కథ ముగించాక మీరెలా స్పందిస్తారో నేనూ చూస్తాను. మనుషుల్లో ప్రేమ, అనుభూతి, శిల్పం గురించి మీరను కున్నంత సారహీనంగా మేం లేం. అయితే ఈ గుండెను పిండే కథ నా శైలిలో చెబుతాను."

రెడ్డిగారి భృకుటి ముడిపడింది.

సుందరం తన మాటల్ని సీరియస్‌గా తీసుకున్నాడు.

సుందరం చెప్పటం ప్రారంభించాడు.

రాము ఇప్పుడుమూడోతరగతి కొచ్చాడు. అతని భుజానికి వ్రేలాడే ఖాకీ సంచిలో ఓ పలక, రెండు మూడు బలపంముక్కలు, చెక్కి ఉంచిన పెన్సిల్ ముక్క, పుస్తకాలూ ఉంటాయి. ఆ పుస్తకాలు మరీ క్రొత్తవిగానూ ఉండవు. అలాగని చిరిగి పోయికూడా ఉండవు. రాము తలకు రాసుకున్న కొబ్బరినూనె మొఖం మీదకు, మెడల మీదకు కారుతుం టుంది. బడికి టిఫిన్ తెచ్చుకొంటాడు. జేబుల్లో తింటానికి ఏవో పోసుకొస్తాడు. జేబులో నుండి వాటిని తీసుకుంటూ, మెల్లగా నములుతూ ప్రకృతిలోకిచూస్తూ నడుస్తుంటాడు. ఆ లేత మనసు ఎప్పుడూ ఏవో ఆలోచనలో మునిగినట్టు కన్పిస్తుంది నల్లటి ఆ కళ్ళునిర్మలంగానూ అమాయకత్వంతోనూ నిండి ఉంటాయి.

"రామాపురం ఓ కుగ్రామం. ఆగ్రామంలోకి ఇంకా కరెంటు రాలేదు. సాయంకాలానికి ఓ మనిషి చిన్న నిచ్చెన వేసుకొని వచ్చి వీధి దీపాన్ని వెలిగించి వెళుతుంటాడు. దూరంనుండి చూస్తుంటే ఆ దీపం దిక్కులేని అనాధలా కనిపిస్తుంటుంది. ఆ ఊరిలో చాలా ఇళ్ళలో దీపాలు వెలగవు. ఓ నాలుగయిదు ఇళ్ళలో మాత్రం తెల్లవార్లూ దీపం వెలుగుతుంటుంది. మిగతా వారంతా చీకటి పడగానే భోజనాలు ముగించుకొని తర్వాత ఓ గంట పిచ్చాపాటి మాట్లాడుకున్నాక నిద్రలోకి జారిపోతుంటారు. ఆ గ్రామంలోని విశాలమైన రావిచెట్లమీద పక్షుల అరుపులుమాత్రం విన్పిస్తుంటాయి. వెన్నెల వెలుగు ఆ ఊరిలో ప్రవహించే కాలువమీద, మామిడి తోటలమీద, కొబ్బరాకులమీద, ఆరుబయట నిద్రించే ప్రజానీకం మీదపడి, చల్ల గానూ, బంగారంలానూ మెరుస్తుంటుంది. అమావాస్య చీకటి రాత్రుల్లోమాత్రం గాఢాంధకారం ఉంటుంది. అయినా కాలువలో సుడులు తిరిగే నీటి వింత శబ్దం... పక్షులగోల శ్రావ్యంగా వినిపిస్తుంటాయి. అంధ

కారంలో సైతం నీటి మెరుపుల్ని కాలువ వడ్డున కూర్చుని గమనిస్తుంటారు కొందరు.

ఉదయం లేవగానే పశువులశాలతో కార్యక్రమం ఆరంభమవుతుంది. పొలాలు వెళ్ళేవారు, పట్నానికి పనిమీద వెళ్ళేవారితో సందడిగా ఉంటుంది. ఒకరినొకరు పలకరించుకోవటంలోనూ, ఇద్దరు కలిసినప్పుడు మాట్లాడుకొనే విషయంలోనూ వారు తమపొలాలగురించి, పంట దిగుబడుల గురించే ఉంటుంది. దేశంలోనూ, ప్రపంచంలోనూ ఎలాంటి మార్పులొస్తున్నాయో వారికవసరంలేదు. ఆ ఊరి మునసబుగారు, కరణంగారు, ఇంకా కొందరు మోతుబరులు మాత్రం రచ్చబండ దగ్గరకు చేరుతుంటారు. ఆ గ్రామంలో బడి లేదు. అయినా బ్రహ్మాండమయిన గుడి ఉంది. ఆ గుడిలో ప్రతి సంవత్సరం తిరనాళ్ళ పండగ జరుగుతుంటుంది. ఆ గ్రామంనుండి పెళ్ళయి చుట్టుప్రక్కల ఉన్నవారంతా ఆ రోజు అక్కడికి చేరుకుంటారు. చుట్టుప్రక్కల గ్రామాల నుండి జనం వస్తారు. రకరకాల సామాన్లు వస్తాయి. ఆ రోజు బాగా అమ్మకాలు జరుగుతాయి. చిన్న చిన్న అందమైన బొమ్మల దగ్గర్నుండి, పేకు సామాను వరకు అక్కడ లభిస్తాయి.

ఆ ఊరికి బస్సురాదు. బస్సు ఎక్కాలంటే రెండు మైళ్ళ దూరంలో ఉన్న మరో గ్రామం చేరాల్సి వుంటుంది. ఆ గ్రామాని కయినా వర్షం నిలబడి రెండు దుక్కులు కురిస్తే బస్సులరావు. ఆ రోడ్లు మట్టివి. వర్షం మూలంగా ఏర్పడిన బురదమూలంగా వాటిలో బస్సులు ఇరుక్కు పోతుంటాయి. ఆ బస్సెక్కి దాదాపు గంటన్నర ప్రయాణం చేస్తే ఓ చిన్నటౌను వస్తుంది. ఆ టౌనులో రెండు సినిమాహాళ్ళున్నాయి. పదో తరగతి వరకు ఉన్న స్కూలుంది. కొంచెం డబ్బున్న వారంతా అక్కడినుండే సరుకులు తెచ్చుకుంటారు. మిగతా వారంతా శెట్టిగారికొట్లోనే మూడోరకం వస్తువులు వాడుతుంటారు. ఆయన అప్పులు పెట్టి పంటలు వచ్చాక వసూలు

చేసుకుంటాడు. ఆయన గ్రామంలోనే నాలుగు ఎకరాలు కొన్నాడు. ఆయన వ్యవసాయం చేయడంతోపాటు ధాన్యం కొంటుంటాడు.

అక్కడి పాలేర్లు సంవత్సరానికోసారి ఎవరో ఒకరి దగ్గర కమతానికుంటారు. ఇంకా వాళ్ళు చేసే అప్పుల మూలంగా కూడా పనిచేయాల్సి ఉంటుంది. వర్షం కురిసినా, కురవకున్నా అక్కడి రైతు జీవితాల్లో సంక్షోభం తలెత్తుతూంటుంది. ఆరు గాలం పనిచేసినా పూర్తిగా అందరికీ కడుపు నిండదు.

ఆ గ్రామంలో బడిలేదు. అందుకే అక్కడి ప్రజల్లో చదువుపట్ల అంతగా అభిరుచిలేదు. చాలమంది పిల్లలకు ఆ అవకాశంకూడా లేదు. ఓవేళ ఎవరైనా చదువు మొదలు పెట్టినా మహా అయితే 5 లేక 6 తరగతుల్తో ముగుస్తుంటుంది. స్కూల్ ఫైనల్ పూర్తిచేసి కళాశాలలకు వెళ్ళినవారు వ్రేళ్ళమీద లెక్కించదగినంత అరుదుగా ఉంటారు.

ఆ గ్రామ ప్రజలకు ఓట్లున్నాయి. చాలా సందర్భాల్లో మాకు ఓటెయ్యమని కూడా ఆ గ్రామం పైపు ఏ రాజకీయపార్టీ రాలేదు, వ్యక్తులూ పోలేదు. అయినా ఆ గ్రామ ప్రజలు ఓట్లు వేస్తూనే ఉన్నారు.

ఆ గ్రామంలో అధికారం ఉంది. అంతరాలున్నాయి. దరిద్రం ఉంది. విషాదం ఉంది. అయితే అవేవీ గొప్పగా సంఘర్షిస్తున్నట్టు కనబడవు. అంత మాత్రాన అసలు సంఘర్షణ లేకుండానూ పోలేదు. అంతర్లీనంగా ఆ గ్రామంలోని వైరుధ్యాలు ఓ రూపం తీసుకుంటున్నాయి. అత్యంత సహజంగా ఏదో రోజు బద్దలవుతాయి కూడా.

మొత్తం ఆ గ్రామం నుంచి ప్రాథమిక పాఠశాలకు వెళ్ళేవారి సంఖ్య ఏ నాడూ పదిమందిని మించదు. ఆ పదిమందిలోనూ రోజూ అయిదారుగురు ఏదో పనిమీదమానేస్తుంటారు. ఆ కుర్రాళ్ళంతా భుజాన సంచులు తగిలించుకొని కాందిశీకుల్లా నడిచి పోతుంటారు.

వారు వెళ్ళేబడికూడా ఎయిడెడ్‌పాఠశాల. ఆ బడికి ముగ్గురు పంతుళ్ళు మాత్రంవున్నారు. వారికి జీతాలు ఎప్పుడొస్తాయో తెలియదు. జీతాలువచ్చినా వారిచేతికెంతొస్తాయో కూడా ఒకో సందర్భంలో ఊహించలేరు. వాళ్ళు కుర్చీల్లోకూర్చుని తూగుతుంటారు. కుర్రాళ్లు ఎవరిష్టంవచ్చిన పద్ధతుల్లోవారు గొడవచేస్తుంటారు. పశువులపాకలాంటి ఆ బడిలో, దుమ్ములో ఆ పిల్లలు విద్యార్థులుగా గాక పశువుల సంతతిలానూ, అక్కడి ఉపాధ్యాయులు వాటిని మళ్లేనే జీతగాళ్ళలానూ వుంటారు. కొన్ని పశువులు చాలా బుద్ధిగా గడ్డి మేస్తుంటాయి. వాటిని ఏ ప్రాంతంలో తోలితే అక్కడే ఉంటాయి. జీతగాళ్ళు మాత్రం ఆడుకుంటూనో, నిద్రపోతూనో ఉంటారు. ఇక్కడి పరిస్థితిఅదే. అలాంటి బడిలో అక్షరాలునేర్చుకొని, పుస్తకాలుపట్టి, ఒక్కొ-అక్షరం కూడబలుక్కొని చదువుతుంటే ఆ గ్రామంలో వారికి ఆనందం కలిగేది.

రోజూ బడికి వెళ్ళే నలుగురయిదుగురిలో రాము ఒకడు. రాముని 'పొట్టోడా' అంటుంటారు. రాము ఎంత పొడుగ్గా ఉంటాడో, అతని సంచి, అంత పొడుగ్గా ఉంటుంది. ఓ భుజానికి సంచి, మరో చేత్తో తెల్లటి టిఫెన్ గిన్నెలో అన్నం— ఈ రెండింటి బరువుకు బ్యాలన్స్ అయినట్లు నడుస్తుండే వాడు. వాన వచ్చినప్పుడు కూడా బడిమానేవాడుకాదు. ఆ బురదలోనే నడుచు కుంటూ వెళ్ళేవాడు. ఎందుకో రాముకు బడంటే అంతప్రేమగా ఉండేది. ఆదివారంనాడో, పండగలప్పుడో శెలవులివ్వటం జరిగితే, ఆ రోజుల్లో ఏం తోచేదికాదు. ఏదో పోగొట్టుకున్నట్లు బాధపడేవాడు.

ఆ బడే రాము విశాల ప్రపంచం. అక్కడ తన తోటి విద్యార్థుల్తో గోల చేయటం, కబుర్లాడటం, కలిసి భోంచేయటం నిరంతరాయంగా సాగాలని ఆశించేవాడు. వాళ్ళంతా రామాపురం నుండి బయలుదేరి వెళుతుండేవారు. ఉదయంలేచి కాలకృత్యాలు తీర్చుకున్నాక, సద్దన్నంతిని బయలుదేరేవారు. త్రోవ పొడుగునా బోలెడుసంగతులు మాట్లాడుకునేవారు.

రాము ఇంతవరకూ సినిమా చూసి ఎరగడు. ఎవరైనా సినిమా చూసొచ్చి ఆ విషయాలు వివరిస్తుంటే అద్భుతంగా వింటుండిపోయేవాడు.

రామాపురం గ్రామం దాటాక చిన్న కాలిబాట ఉంది. ఆ బాటవెంట నడుచుకుంటూ వెళ్తారు. ఆ బాటకిరువైపులా పంటకాలువ ఉంటుంది. సరిగ్గా మైలుదూరం దాటాక ఓచెరువు వుంది. ఆ చెరువులో కలువ పువ్వు లుంటాయి వాటిలో విచ్చుకున్నవి కొన్నయితే, మొగ్గగా ఉండేవి మరి కొన్ని. ఆ చెరువు నీటిమీద తామరాకులు తేలుతుంటే వాటిమీద పడ్డ నీటి బిందువులు అందంగా మెరుస్తుండేవి. ఆ చెరువులో రెండు రకాల కలువలుంటాయి. తెల్లటి కలువలు.... ఎర్రటి కలువలు. అందులో తెల్లటి కలువ పువ్వులు ఎక్కువ ఉండేవి. ఎర్రకలువలు మాత్రం ఒకటో, రెండో వుండి తెల్లటి కలువల నడుమ మెరుస్తుండేవి.

రాముకు బడికి వెళుతూ వాటిని చూడటం చాలా ఇష్టంగావుండేది. మొదట్లో అయితే చెరువులోకి దిగి వాటిని కోసుకు తెచ్చుకోవాలని చెరువులో దిగటానికి పూనుకుంటే తోటివారు కసిరాదు.

"ఏంటిరోయ్ చెరువులోకి దిగేస్తున్నావు. చచ్చిపోగలవు. మీఅమ్మతో చెప్పమంటావా" అన్నారు.

చచ్చిపోవటంకన్నా అమ్మకు చెబుతానంటే రాముకు భయం కలిగింది.

కిట్టుగాడు మాత్రం ఎవర్నీ లెక్క చేయకుండా చెరువులోకి దిగి పూలన్నింటినీ త్రెంచిపడేసేవాడు. వాటిని ఆప్యాయంగా అందుకొని వాసన చూస్తుంటే చెప్పలేనంత తన్మయత్వం కలిగేది. కిట్టుగాడు నవ్వేవాడు విజయ గర్వంతో. కిట్టుగాణ్ని చూసి మిగతా వాళ్ళు కూడా నవ్వేవారు. కిట్టుగాడి బట్ట లన్నీ తడిసిపోయేవి. వాళ్ళందరి ముందు బట్టలిప్పేసేవాడు. తిరిగి చెరువు లోకిదిగి బట్టలు గుంజి, నీళ్ళు పిండి భుజానవేసుకొని నడిచొస్తుండేవాడు. బడి దగ్గరకు రాగానే బట్టలు వేసుకునేవాడు. తడితడిగా ఉండే బట్టల్తోనే

క్లాసులో కూర్చునేవాడు. కిట్టు ప్రక్కన ఎవరూ కూర్చొనేవారు కాదు. వాడు కూర్చున్నంతమేరకు తడిముద్రలు పడుతుండేవి. చదువు ఏ మాత్రం అబ్బేది కాదు. అయినా చాలామంది దృష్టిలో కిట్టు హీరో.

కొబ్బరిచెట్లెక్కి దొంగతనంగా కాయలు కోయటం, తాటిచెట్లు ప్రాకి ముంజికాయలు నరకటం, కాలవల్లో ఈదటం, మాష్టారి పేనుబెత్తంతో దెబ్బలు తినటం, గేదెలమీద రాజకుమారుడిలా కూర్చుని దౌడు తీయించడం, ఎంగిలి చుట్టలూ, బీడీలూ కాలవటం, చిలిపి పనులు చేయటం ఒక్క కిట్టు వల్లనే సాధ్యపడేవి.

రాము కలువ పువ్వుల కోసం చెరువులో దిగినప్పుడు కిట్టు కూడా కోప్పడ్డాడు. వాడు ప్రాణాలకు సైతం తెగించి ఎలాంటి సాహసం అయినా చేయగలిగేవాడు. ఓసారి జర, జర పాక్కుంటూ వెళుతున్న పాము వెంట బడి తోక పట్టుకొని గిరగిరత్రిప్పి నేలకు బాదాడట. మూర్ఖంగా చేసే పనుల వల్ల అనేకసార్లు కిట్టుకు దెబ్బలు తగిలాయి. అయినా వాటిని లక్ష్యపెట్టే వాడుకాదు. కానీ కిట్టుకు రాము అంటే ఎందుకో చెప్పలేనంత ప్రేమ. తరచుగా రామును ప్రేమగా ముద్దు పెట్టుకుంటుండేవాడు. తనను అంత బలంగా ముద్దు పెట్టుకున్నందుకు, తన బుగ్గలకు తడి అయినందుకు అయిష్టం కలిగినా ఏమనేవాడు కాదు. కిట్టు తన కోసం పూలు కోసిస్తాడు. తనను వీపుమీద ఎక్కించుకొని తీసుకెళ్తాడు. తనను బడిలో ఎవరైనా ఏమన్నా అన్నారని తెలిసినా ఊరుకునేవాడుకాదు. అలాంటి కిట్టు కోప్పడి నప్పుడు రాము బిక్కమొగం వేశాడు.

"అట్లా చూడబోకురా నీకెందుకు నువ్వు ఎన్నిపువ్వులుకావాలో చెప్పు నేనుకోసిస్తాగా దాంట్లో దిగకూడదురా... దిగితే చచ్చిపోతావు" అనిచెప్పి "సరేనా" అన్నాడు కిట్టు.

తలూపాడు రాము.

రామువాళ్ళది మధ్యతరగతి కుటుంబం. వాళ్ళకు రెండెకరాల పొలం ఉంది. చాలాకాలందాకా రాము తల్లిదండ్రులు సంతానంకోసం ఎంతగానో అల్లల్లాడిపోయారు. అందుకోసం చేయనిపూజలేదు కట్టించు కోని తాయిత్తూలేదు. రాము పుట్టాడు. పుట్టిన దగ్గర్నుండి రాము తల్లికి తన బిడ్డను బాగా చదివించుకోవాలనే కోర్కె. ఆ ఊర్లో బికాం కోటేశ్వర్రావు ఒకాయనున్నాడు. ఆ ఊరికి తొలి గ్రాడ్యుయేట్ అతనే, అతనివంక రామాపురం ప్రజలు అద్భుతంగానూ, ఆశ్చర్యంగానూ చూస్తుంటారు.

రాము తల్లి తన బిడ్డకూడా అంతగా చదువుకొని పేరు తెచ్చుకో వాలని భావించేది. ఆమెకు జ్ఞానం వచ్చినప్పటినుంచి ఆ పల్లెలో ఎలాంటి మార్పులేదు. అదే జీవితం. అక్కడి పిల్లలు నల్లగాఉంటారు. గేదెల్ని తోలు కొని ఊరవతల మేపుకొస్తారు. వారి శరీరం నిండా దుమ్ము గేదెల్తోపాటువారు కూడా వాసన కొడుతుంటారు. ఆడపిల్లలయితే ఇళ్ళు ఊడవటం, ముగ్గులు వేయటం, ముగ్గులు చేయటం, ఉయ్యాలలుకట్టి ఊగటం, కొంత వయసు రాగానే అమాంతం పెద్దరికం వచ్చినట్లుగా పరాయివాడికంట కనపడకుండా విడియపడటం, పుష్పవతికాగానే తాటాకులమీద కూర్చొని- అప్పటికి తాను మిగతావారినుండి విడివడి పెద్దదాన్నయ్యాననే భావం, ఆ క్షణంనుండే పెళ్ళికొడుకుల కోసం తల్లితండ్రుల ఆరాటం ఎవరెవరో వచ్చి చూడటం, పెళ్ళయి అత్తారింటికి వెళ్ళి, తిరిగి తమ పొలాలు.... ధాన్యాలు.... కష్టాలు.... ఎన్ని సంవత్సరాలు గడుస్తున్నా అదే జీవితం. ఎక్కడ వేశావు గొంగళి అంటే అక్కడే ఉన్నట్లుగా ఆడవారి జీవితమయినా— మగవారి జీవిత మయినా.

అలాంటి జీవితం నుండి ఎక్కడో, ఎవరో ఓ చిన్న విజయం సాధిస్తే అదో ఘనత. శాశ్వత కీర్తి తన బిడ్డకూడా అలానే పేరు తెచ్చుకో వాలి. తన బిడ్డ అందరిలా ఉండడు. ఎఱ్ఱని దేహచ్ఛాయ- నిర్మలమైన

మొఖం. చూట్టానికి ఎంత అందంగా ఉంటాడని-తనుకూడా ఆ మాట అనుకొని వెంటనే దిష్టి తగులుతుందేమో అని బాధ పడేది.

తన బిడ్డ రెండుమైళ్ళు నడిచి చదువు కోవాలనుకున్నప్పుడు మొట్ట మొదటిసారి ఆమె చాల బాధపడింది. అంతదూరం ఎలా నడవ గలడను కొంది. కొంచెం పెద్దవాడయ్యేదాకా చదువు ఆపితే, ఈ లోపు అలవాట్లకు గురయి, చదువుమీద దృష్టి ఏర్పడకుంటే, వాడూ తలకు గుడ్డచుట్టుకొని, పొలం పనులకు వెళితే-ఆ ఆలోచనే భరించలేదు.

అందుకే ఆ రోజు రాత్రి భర్తతో అంది "మన ఊర్లోకూడా బడుంటే బాటుంటుంది" వెంటనే అది అతనికి కూడా సబబేననిపించింది. మరుసటిరోజు ఆ మాట ఆయన నలుగురయిదుగురు దగ్గర అన్నాడు. ఊరంతా ఒకరి తర్వాత ఒకరు ఆ విషయం గురించే చర్చించుకున్నారు. ఈ విషయం మునసబు గారి చెవిన పడింది. ఆయన ఆలోచించాడు. ఎందుకో ఆయన బడొస్తే ఆ తర్వాత ఏదేదో మార్పులొస్తాయనిపించింది. ఎందుకో స్పష్టంగా తెలియకపోయినా ఆ చర్యను ఆమోదించలేకపోయాడు. బడి కావాలనే కోర్కెకు అసలు పునాది అదే.

బడి ఉంటేనే మనం ఇన్నాళ్ళు బ్రతికామా అని కొందరు అభిప్రాయ పడ్డారు. మొత్తంమీద ఆ గ్రామంలో క్రొత్త వాతావరణం వచ్చినట్లని పించింది. బడి కావాలనటం బాగానే వుంది. అందుకు ఏం చేయాలి? ఎవర్ని కలుసుకోవాలి? అన్నీ ప్రశ్నలే. ఈలోపు ఎన్నికలొచ్చాయి. ఒకాయన ఓట్లు అడగడానికి మొత్తంమీద ఆ గ్రామం రాగలిగాడు. రాము తండ్రి అతన్తో బడికావాలనే విషయం చెప్పాడు. అందు గురించి కొంత విమర్శకు గురయ్యాడు.

"అదేందయ్యా వెంకట్రాముడిగారు సుబ్బారావు బడికావాలంటాడు. ఈ ఊరికి రోడ్డుందా, కరెంటుందా... కిర్సనాయిలుందా ఏ వుందని 'బడి కావాలంట"

మునసబుగారికి ప్రమాదం ముంచుకొచ్చినట్లనిపించింది. ఆయనకు రోడ్లు రావటం, కరెంట్ రావటం ఇష్టమే. కానీ వాటితోపాటు ఇంకేమో రాగలవని ఆయన మనసు చెబుతూంది.

నేను గెలవగానే మొదట పెట్టించేది బడినే అంటూ ఆయన గంభీరంగా వాగ్దానం చేశాడు. ఎన్నికలయిపోయాయి. ఆయన అయిపూ జాడా లేకుండా పోయారు. బడి విషయం మరుగునపడిపోయింది. రాము తల్లి మాత్రమే ఆ ఊళ్ళో బడి గురించి ఆరాటపడేది. తాను నేర్చుకున్న రెండు ముక్కలు తన బిడ్డకు చెబుతుండేది. వాడు బాగా చదువుకొని ఆ గ్రామాన్ని మార్చాలని ఆమె ఆరాటం. ఆ విషయాన్ని ఆ లేత హృదయానికి అర్థ మయ్యేరీతిలో చెప్పటానికి ప్రయత్నించేది. చదువుకు వ్యతిరేకంగా ఎలాంటి మాటల్ని రాము దగ్గకురానిచ్చేదికాదు. మొత్తంమీద రాము మూడవ తరగతి కొచ్చాడు. ఇంకా రెండు సంవత్సరాలు చదివితే తిరిగి మరో ఊరు వెళ్ళాలి. అంతగా అయితే రాముకోసం తాను కూడా అక్కడే కాపురం పెట్టాలని నిర్ణయించుకొంది. అయినా ఈలోపు తమ ఊరికి బడి రావటమో....లేక ఇప్పుడు చదివేచోట ఆ బడి స్థాయి పెరగటమో జరుగుతుందని ఆమె గట్టి నమ్మకం.

రాము బడికి వెళుతున్న కాలం నుండి వచ్చిన మార్పల్లా అతను ఒక్కోక్లాసు పెరగటమే. అతను నడిచేబాటలో, పరిసరాల్లో ఏ మార్పులూ లేవు. అయితే అతన్తోపాటు అందరూ చదువు కొనసాగించలేకపోయారు. మరికొందరు క్రొత్తవారు కలిశారు. ఈ మూడు సంవత్సరాల్లో ఏనాడూ తిరిగి కలువల్ని కోయటానికి రాము ముందుకెళ్ళలేదు. ఆ చెరువు ఒక్కో కాలంలో ఒక్కోరకంగా ఉంటుంది. ఓసారి చెరువంతా పద్మాలతోనూ తామరాకులతోనూ ఉంటుంది. తామరాకుల నడుమ తలెత్తిన పూలు అందంగా

మెరుస్తుంటాయి. మరోసారి అక్కడక్కడా తామరాకులుండేవి. వాటి నడుమ తేటనీరు... తామరాకుల్తోపాటు పెరిగి పైకి వచ్చిన పూలు... చూడ టానికి ఆ దృశ్యం ఎంతో అందంగా ఉండేది.

రాము ఉదయం, సాయంకాలం ఆదృశ్యం చూస్తుంటాడు. అయినా ఏ మాత్రం విసుగు కలిగించదు. ఉదయానికి కొన్ని విచ్చుకోవటానికి సిద్ధంగా ఉంటాయి. తిరిగి వచ్చేటప్పటికి ఎవరో కోసుకుపోతుండే వారు.

ఆ రోజు మామూలుగా రాము తన సంచితోనూ, టిఫిన్‌తోనూ బయలుదేరాడు. ఊరి పొలిమేర్లలో ఎవరూ కలవలేదు. కొంచెంసేపు అలానే నిలబడి చూశాడు. ఎవరూ వస్తున్న జాడకనిపించటంలేదు. పొద్దెక్కు తోంది. బడికి ఆలశ్యం అయ్యేటట్లుగా ఉంది. ఈ రోజు తాను కూడా బడి మానేస్తే అనుకున్నాడు. కానీ బడి మానాలనిపించ లేదు. తనకు తెలియకుండానే అడుగులు ముందుకు పడ్డాయి. మెల్లగా నడుస్తున్నాడు. ఆకాశం నిర్మలంగా ఉంది-ఒక్క మేఘం కూడా లేకుండా రాము అలాంటి దృశ్యాన్ని అరుదుగా చూసుంటాడు. ఎవరయినా వచ్చి తనను కలవగల రేమోనని వెనక్కు చూసుకుంటూ నడుస్తున్నాడు. ఎవరూ రావటంలేదు.

ఊరు క్రమంగా దూరమవుతూంది. తాను రోజూ నడిచేబాట. ప్రతి అంగుళం సుపరిచితమయిన త్రోవలో రాము నడుస్తున్నాడు.ఆ లేతమనసులో ఏవేవో ఆలోచనలు పరుగుతీస్తున్నాయి. పొలంగట్ల వెంట పారుతున్న నీటి సవ్వడి, కీటకాల ధ్వనులు వినపడుతున్నాయి. రోడ్డంతా ఖాళీగా ఉంది. వచ్చేవారూ...పోయేవారూ ఎవరూ కనపడటంలేదు. ఏకాంతంగా ఏ దూరపు తీరాలకో పయనించే బాటసారిలా ఉన్నాడు.

రాము కాళ్ళు అప్రయత్నంగా ఆగిపోయాయి. ఎదురుగా చెరువు కనపడింది. వాటిలో విచ్చుకున్న తామరపూలు బంగారంలా మెరుస్తున్నాయి. అడుగులు ముందుకు పడలేదు. చేతిలోని సంచి, టిఫిన్ కింద వుంచాడు. చెరువుగట్టుమీద కూర్చుని వాటివంక తనివితీరా చూడసాగాడు.

చెరువునిండా తామ రాకులు నిండివున్నాయి వాటి నడుమ తెల్లటి తామరపూలు విచ్చుకొని అలలతాకిడికి మెల్లగా కదులుతున్నాయి రాముచూపు వాటినడుమవున్న ఎర్రకలువమీద వుంది. అది వాటన్నింటికీ రాజులా నిలబడి వుంది. తెల్లకలువలన్నీ దానికి రక్షణ దుర్గంగా పనిచేస్తున్నట్లు చుట్టూ నిలబడ్డాయి.

కిట్టు ఒకటి రెండుసార్లు ఎర్రకలువలు కూడా కోసిచ్చాడు. వాటిలో రంగు భేదం తప్పించి అంతగా తేడా కనిపించలేదు. అయినా ఎందుకో ఎర్రకలువలంటే అంతప్రేమ. అరుదయినవస్తువులపట్ల ఆరాధన, ఆకర్షణ పెరుగుతాయేమో!

రాము ఓసారి వెనక్కూ, ముందుకూచూశాడు. నిర్మానుష్యంగా వుంది. కలువపూలు తనను ఆహ్వానిస్తున్నట్లున్నాయి.

అతనికిప్పుడు అంతులేనంత సంతోషంగా ఉంది. ఈరోజు బడికి ఎవరూ రాకపోవటం ఎంత అదృష్టం అనుకున్నాడు. తను స్వయంగావెళ్ళి ఎర్రకలువను కోసుకు తెచ్చుకోవాలి. తన చేతుల్తో తెచ్చుకున్న ఆ కలువను ఆఘ్రాణిస్తూ ఆ ఆనందాన్ని తనివితీరా అనుభవించాలి. తనూ కలువపువ్వు కోయగలడు. ఈ విషయం ఘనంగా చెప్పాలి.

అకస్మాత్తుగా రాము లేచాడు. అప్రయత్నంగా ముందుకు నడిచాడు. అంతలోనే బట్టలు తడిసిపోతాయనిపించింది. పిండి ఆరేసుకుంటే నను కున్నాడు. అవి వెంటనే ఆరవు. మాష్టారు తన్నవచ్చు. మొండిమొలతో దిగితే శరీరం తొందరగా ఆరిపోతుంది. ఆ తర్వాత బట్టలు వేసుకోవచ్చు ననుకున్నాడు.తిరిగి వెనక్కి నడిచాడు. లాగు విప్పాడు.ఎర్రటి మొలత్రాడు మెరిసింది. చొక్కావిప్పిరెండూ కలిపి మడిచాడు నేలమీద వుంచి అవి గాలికి ఎగరకుండా దానిమీద టిఫిన్ బాక్సుంచాడు. మరోసారి చుట్టూ చూశాడు. ఎవరూ కనిపించలేదు. సంతృప్తిగా అడుగు ముందుకు వేశాడు.

రాములో తెలియని ఆనందం కట్టలుత్రెంచుకు ప్రవహిస్తోంది. ఇలాంటి అనుభూతి కోసం ఎన్ని సంవత్సరాలు ఎదురు చూశాడు. తాను పిల్ల వాడ్నని తిట్టి-తనకోర్కెను సాధించుకోకుండా చూశారు. ఈ రోజు ఎవరు అడ్డువస్తారు?

అతని పెదవుల మీద ఎందుకో తెలీనిదరహాసం. అతని కాళ్ళు నీళ్ళను త్రాకగానే జివ్వున లాగాయి. చల్లగా ఉన్నాయి. ముందుకు నడిచాడు. కొంతదూరం పోయాక ఓ చిన్న పువ్వు చేతికి అందింది తెంచాడు. నీటి అడుగునుండి ఒక్కసారిగా బురదనీరు పైకివచ్చింది. ఆ పువ్వును బయటకు విసిరేశాడు గర్వంగా.

రాము కళ్ళు ఎర్రటి కలువమీద, దాని ప్రక్కన విచ్చుకున్న పెద్ద తెల్ల కలువమీద ఉన్నాయి. ఈ రోజు ఎలాఅయినా వాటిని సాధించగలగాలి. ముందుకు నడిచాడు. లోతు ఎక్కువ తున్నట్లుంది- అయినా ముందు కే!

అక్కడ ఆగి చేయిచాచాడు. మునివ్రేళ్ళకు తగులుతూంది. ఎర్ర కలువ ఇంకా ముందుకు ఒక్క అడుగు వేసినా అతనికి అందదు. ఆ విషయం రాముకు తెలుస్తూనేఉంది. అందుకే అక్కడే నిలబడి ఆ కలు వను అందుకోవాలని విశ్వప్రయత్నం...

అతనికి తెలియకుండానే పాదాలు మెల్లగా కదులుతున్నాయి. రాము కాళ్ళక్రింద మట్టిమెల్లగా కరిగి జారుతుంటే మునివ్రేళ్ళలో చిక్కిన కలువ పువ్వును సున్నితంగా తడుముతూ మెల్లగా కాడ దగ్గరకుచేతినిపోనిచ్చి ఒక్కసారిగా త్రెంచాడు.

అదే సమయంలో...

కాళ్ళక్రింద మట్టి ఒక్కసారిగా పల్లంలోకి జారిపోయింది. ఆ కళ్ళు అత్యంత తృప్తిగా, గర్వంగా ఎర్రకలువనుచూస్తూ, తనలోకి ఐక్యం చేసుకోవాలన్న ప్రయత్నంలో ఉండగానే...ఆ శరీరంలో లోతుల్లోకి జారిపోయింది.

అగాధాల మురికికూపంలోకి రాము నెట్టి బడవేయబోతుంటే, కలల నుండి ఇలలోకి అనుభూతుల నుండి వాస్తవంలోకి వస్తుంటే తామరాకులమీద నీటిబొట్టు కంగారుగా చెదిరిపోయి, తామరాకులమీదపడ్డ బరువుకు నిలువుగా జారిపోయి నీటిలో కలిస్తే ఒకసారిగా రాము శరీరం నీటిలో మునిగి... ప్రపంచమంతా పసుపు పచ్చగా కనపడి, చెవుల్లో వేయి సముద్రాలహోరు వినపడితే, అడుక్కు జారిపోతూ...ఏమీ అర్థంకాక...పాదాలు ఏనేలనో త్రాకి...తిరిగిపైకెళ్తూ... కెవ్వునకేకవేస్తే గొంతులోకినీరు ఉప్పెనలా! బాట నిర్మానుష్యం!

పుస్తకాలు, చేతిసంచి, అన్నపు మెతుకుల మౌన రోదన "అయ్యయో!చిన్నారి పసిబాలుడు ఏ నేరం చేశాడు?అందమయిన మా కోసం ఆరాటపడి నిట్టనిలువునా కూరుకుపోయాడే" కలువపూల గుండె చప్పుడు!

అయ్యో! ఓ దేవతలారా! ఎక్కడెక్కడున్నారు. రండి రారండి... కలువపూల అందాన్ని, ప్రకృతిసోయగాల్ని ఆరాధించి, అనుభూతిచెంది. వాటిలోనే ఐక్యం అవుతున్న ఈ పసిబిడ్డను రక్షించండి... ఓ పక్షులారా... దిక్కులారా... ఆకాశమా... దిగిరా... రండి... రారండి... అయ్యో... అయ్యయ్యో... క్షణంక్రితం మొఖంలో అంతులేని ఆనందం ఇప్పుడేమో కల్లోలం

అయ్యో.... మునుగుతూ....తేలుతూ నీటకొట్టుకుంటూ.... అరుస్తూ....

గిలగిల తన్నుకొంటూ....

అనుభూతికి పోరాటం....

ప్రాణంకోసం పోరాటం....

రోడ్డు నిర్మానుష్యంగా ఉంది.

గట్టుమీద సంచి, ప్రక్కన బట్టలు, వాటిమీద టిఫిన్ నిశ్శబ్దంగా ఉన్నాయి.

చెరువులో తిరిగి ప్రశాంతత ఏర్పడుతూంది. ఎర్రకలువ మెల్లగా ఒడ్డుకు కదులుతూంది.

వడ్డుకు విసిరేసిన పిల్ల కలువ!

నీటిలోన తేలిపోతున్న మనిషి పువ్వు!

"ఆహా.... విధీ! నువ్వెంత దయాహీనురాలివే" అన్నారు రెడ్డిగారు. ఆయన కళ్ళవెంట నీళ్ళు వర్షిస్తున్నాయి. అక్కడున్నవారిగుండెలు బరువెక్కాయి. సుందరం గొంతు సవరించుకున్నాడు.

"ఈ కథలో మీకు కరుణరసమే కనపడింది. ఇంకా చెప్పాలంటే ఆ గ్రామ జీవితాన్ని వర్ణిస్తుంటే మీకు విసుగే కలిగుంటుంది. ఈ కథవిన్న మీరు సానుభూతి చూపిస్తారు. కన్నీరు కారుస్తారు. ఒక్కగా నొక్క బిడ్డను పోగొట్టుకున్న తల్లి మీద కొందరికి సానుభూతి ఉండొచ్చు. దానికి కారణం విధా? కాదు. రోడ్లులేని, బడులులేని గ్రామాలెన్నో! పసిబిడ్డలు నాలుగు ముక్కలు నేర్చుకోవటానికి క్రోసులదూరం నడిచిపోవాలి. నాలుగు మెతుకుల కోసం ఆరుగాలం పనిచెయ్యాలి. నీళ్ళకోసం మైళ్ళు నడవాలి. ఏమేమోసాధించామంటూ డంభాలు కొట్టే ఈ ప్రభుత్వం రాము చావుకు ఓ కారణం అని నేనంటే మీకు కేకలుగా వినపడతాయి. కానీ అది వాస్తవం. రాము చావు వెనక అజ్ఞానం, సామాజిక పరిస్థితులు అన్నీ ఉన్నాయి. సెంటిమెంట్లు పుట్టేది సామాజిక జీవితం నుండే. రాములాంటి పిల్లలు.... ఈ దేశపు చిరునవ్వులు బలికాకూడదనే మా ఆరాటం.... మాకు మానవుల పట్ల ప్రేమ. కళాత్మక విలువల పట్లప్రేమ లేవని మీరింకా అంటారా రెడ్డిగారూ అన్నాడు సుందరం....

సుందరానికి తెలుసు ఈ ఒక్క సంఘటన అతనిలో మార్పు తేలేదని!

రెడ్డిగారు ఏంమాట్లాడలేదు.

ఆయనింకా ఆ సంఘటన ప్రభావంలోనే ఉండిపోయాడు.

— ప్రజాశక్తి దినపత్రిక